రోడ్డుపై ప్రమాదకరంగా గుంత



కోదాడ- ఖమ్మం రోడ్డుపై ప్రమాదకరంగా గుంత



ఖమ్మం రోడ్డులో హెచ్చరిక బోర్డులు లేకుండా ఉన్న స్పీడ్ బ్రేకర్లు

- ఎమ్మెల్యే ఇంటికి కూత వేటు దూరంలోనే గుంత
- హెచ్చరిక బోర్డులు లేకుండా స్పీడ్ బ్రేకర్లు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

కోదాడ : పట్టణంలోని కోదాడ- ఖమ్మం రోడ్డులో గుంత ప్రమాదకరంగా ఉంది. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నిత్యం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఐదు సంవత్సరాల క్రితం శ్రీరామనవమి రోజు ఇదే రోడ్డులో ప్రమాదం జరిగి నలుగురు మరణించారు. ప్రస్తుతం అదే ప్రదేశంలో రెండు నెలల క్రితం మెకాలిలోతు గుంత ఏర్పడింది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ రోడ్డుపై గుంత కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి నివాసానికి కూత వేటు దూరంలోనే ఉంది. ఇదే రోడ్డుపై నుంచే ఎమ్మెల్యేతో పాటు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తరచూ రాకపోకలు సాగిస్తుంటారు. అయినా అధికారులు మాత్రం గుంత పూడ్చాలనే ఆలోచన చేయకపోవడం గమనార్హం. ఇక వర్షం వచ్చినప్పుడు సదరు గుంత నిండా నీరు చేరుతుండడంతో కనిపించక ద్విచక్ర వాహనదారులు, ఆటోలు తరచూ ప్రమాదాలకు గురువుతున్నారు. ఇదే తరహాలో కోదాడ నుంచి మేళ్లచెరువు వెళ్లే రోడ్డులో కూడ పలుచోట్ల ప్రమాదకరంగా గుంతలున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

జాడ లేని హెచ్చరిక బోర్డులు..

ఖమ్మం క్రాస్ రోడ్డులో గతంలో ప్రమాదం జరిగిన ప్రదేశంలో అప్పటి పోలీస్ అధికారులు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. ఆ తరువాత రోడ్డును విస్తరించి మధ్యలో డివైడర్లు కూడా ఏర్పాటు చేశారు. దీంతో స్పీడ్ బ్రేకర్లు ఒక వైపు సగం, మరోవైపు సగంగా విడిపోయాయి. గతంలో ఇక్కడ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను రోడ్డు విస్తరణ సమయంలో తొలగించారు. కానీ రోడ్డుకు సగం మాత్రమే ఉన్న స్పీడ్ బ్రేకర్లను మాత్రం తొలగించలేదు. పూర్తిగా ఏర్పాటు చేయనూలేదు. దీంతో వాహనదారులు వాటిని గమనించకుండా వేగంగా వెళ్లి ప్రమాదాల బారీన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ సమస్యపై దృష్టిసారించి వెంటనే పరిష్కరించాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం

కోదాడ - ఖమ్మం రోడ్డులో ప్రమాదకరంగా గుంత ఏర్పడి నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరం. ఎమ్మెల్యే ఇంటి సమీపంలో, ఆమె తరచూ తిరిగే ప్రదేశంలోనే సమస్య ఉంటే అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం. రోడ్డు సమస్యను వెంటనే పరిష్కరించి ప్రమాదాలు జరగకుండా చూడాలి.

– ఈదుల కృష్ణయ్య, అడ్వకేట్

క్లుప్తంగా

బీసీ యువజన సంఘం అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ



ఆర్.కృష్ణయ్య నుంచి నియామకపత్రం అందుకుంటున్న లక్ష్మీనారాయణ

మునగాల : బీసీ యువజన సంఘం కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడిగా మునగాల మండలంలోని నారాయణగూడెం గ్రామానికి చెందిన యువజన నాయకుడు గడ్డం లక్ష్మీనారాయణయాదవ్ నియమితులయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా ఆయన నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. బీసీ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతర పోరాటం చేస్తానని తెలిపారు.

కామన్ టైమ్‌టేబుల్ ఉత్తర్వులను రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న గురుకుల ఉపాధ్యాయులు

మఠంపల్లి : గురుకుల పాఠశాలల్లో కామన్ టైమ్‌టేబుల్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ శుక్రవారం మఠంపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో మధ్యాహ్న భోజనం సమయంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలన్నారు. గురుకులాల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎస్పీకి ఫిర్యాదు

నడిగూడెం : భూవివాదంలో తనపై హత్యాయత్నం జరగగా నడిగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే దాడి కేసు నమోదు చేశారని చిలుకూరు మండల కేంద్రానికి చెందిన పుట్టపాక అంజయ్య శుక్రవారం జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన స్థానిక విలేకరులకు తెలిపారు. నడిగూడెం మండలంలోని రత్నవరంనకు చెందిన కురాకుల శ్రీరాములు భూవివాదంలో గత నెల 20న తనపై హత్యాయత్నం చేశాడని, అదే రోజున పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. కానీ హత్యాయత్నం కేసు నమోదు చేయకుండా దాడి కేసు నమోదు చేశారని చెప్పారు. ఈ విషయంపై ఎస్‌ఐ అజయ్‌కుమార్‌ను సంప్రదించగా జరిగిన ఘటనపై గ్రామంలో విచారణ చేపట్టిన అనంతరమే దాడి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

డ్రెయినేజీ నిర్మించాలని ఎంపీడీఓకు వినతి



ఎంపీడీఓ గిరిబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం నాయకులు

చిలుకూరు : మండల కేంద్రంలోని ఈద్గా వద్ద మురుగు నీరు రోడ్డుపై పారుతూ ప్రహరీ దెబ్బతింటోందని, డ్రెయినేజీ నిర్మించాలని కోరుతూ శుక్రవారం ఎంపీడీఓ గిరిబాబుకు ముస్లిం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఇదే విషయమై చిలుకూరు గ్రామ కార్యదర్శి షరీఫ్‌వుద్దీన్‌కు కూడా వినతిపత్రం ఇచ్చారు. ముస్లిం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో శుక్రవారం కోదాడ పట్టణవాసి కొత్తపల్లి లక్ష్మమ్మ సంవత్సరీకం సందర్భంగా ఆమె కుమారుడు బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ రామయ్య పందిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పందిరి ఫౌండేషన్ గౌరవ సలహాదారుడు ఎస్ఎస్‌రావు, ఇందిరమ్మ, లక్ష్మీనారాయణ, రాములు, ఆశ్రమ నిర్వాహకురాలు జ్యోతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరేడుచర్ల : పట్టణంలోని జాన్‌పహాడ్ రోడ్డు విస్తరణలో భాగంగా నేరేడుచర్ల టౌన్-1 ఫీడర్ పరిధిలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నందున శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ పందిరి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు అధికారులకు సహకరించాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణ



నర్సింహులగూడెంలో నిల్వనీటిని తొలగిస్తున్న వైద్యసిబ్బంది



మఠంపల్లి : లాలితండాలో నిల్వ నీటిని తొలగిస్తున్న వైద్య, పంచాయతీ సిబ్బంది

మునగాల : పరిసరాల పరిశుభ్రతతో దోమల వ్యాప్తిని నివారించవచ్చని రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ అసిస్టెంట్ లింగం రామకృష్ణ అన్నారు. శుక్రవారం మునగాల మండలంలోని రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల నర్సింహులగూడెంలో పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి నిల్వ నీటిని తొలగించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తామని, పాము కాటు, తేలుకాటు, కుక్కకాటుకు మందులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఏఎన్ఎంలు కె.పద్మ, పి.పావని, ఆశా కార్యకర్తలు జ్యోతి, రమణ, సుధారాణి, లక్ష్మి, నాగమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

నిల్వ నీరు తొలగింపు

మఠంపల్లి : మండలంలోని లాలితండా, కొత్తతండా, చెన్నాయిపాలెం తదితర గ్రామాల్లో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ, వైద్య సిబ్బంది, ఆశా వలంటీర్లు ఇళ్లలో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. కార్యక్రమంలో కార్యదర్శులు నాగేశ్వరరావు ఉమ, తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలని వినతి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

మఠంపల్లి : మండలంలోని అటవీ భూములను సుమారు 40 ఏళ్లుగా సేద్యం చేసుకుంటున్న గిరిజనులకు ప్రభుత్వం పట్టాలివ్వాలని కోరుతూ శుక్రవారం తెలంగాణ గిరిజన సంఘం నాయకులు మఠంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు భూక్యా పాండునాయక్, జిల్లా అధ్యక్షుడు మాలోతు బాలునాయక్‌లు మాట్లాడుతూ మండలంలోని సుల్తాన్‌పూర్‌తండా, భీమ్లాతండా, గుర్రంబోడుతండా, భోజ్యాతండా, కృష్ణతండా, లాలితండా, చెన్నాయిపాలె పరిధిలో గిరిజనులు పోడు భూములను సేద్యం చేసుకుంటున్నారని, వారికి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం భూ పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బోడ్కానాయక్, పున్నానాయక్, సయ్యద్‌రస్‌మియా, పాడిశెట్టి రాము, బ్రహ్మచారి, కేశానాయక్, శ్రీను, లింగానాయక్, నాగేశ్వరరావు, బాలు, మక్కానాయక్, భద్రునాయక్, శివశంకర్, రాము, తులసి, చీనా, రవి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రజాప్రతినిధులకు సత్కారం



మాజీ ఎంపీపీని సన్మానిస్తున్న అధికారులు

నడిగూడెం : మండల పరిషత్ పాలక వర్గ పదవీకాలం ముగియడంతో శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మాజీ ఎంపీపీ యాతాకుల జ్యోతి మధుబాబు, మాజీ జెడ్పీటీసీ బాణాల కవిత నాగరాజులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హేమామాలిని, ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్, ఎంపీఓ దుర్గాప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ బడేటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, నాయకులు పాలడుగు ప్రసాద్, దేవబత్తిని సురేష్ ప్రసాద్, పుట్ట రమేష్, దేవబత్తిని రమేష్ ప్రసాద్, గడ్డం మల్లేష్, చిల్లంచర్ల సత్యనారాయణ, నూకపంగు వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

పురాతన భవనాన్ని కూల్చివేయాలి



శిథిలావస్థలో ఉన్న ఆర్‌అండ్‌బీ భవనం

మునగాల : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పక్కన దశాబ్దాల క్రితం నిర్మించిన ఆర్‌అండ్‌బీ భవనం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉందని తక్షణమే ఆ భవనాన్ని కూల్చివేయాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, గ్రామ ప్రజలు కోరుతున్నారు. కాగా, గతంలో ఈ భవనంలో సివిల్ ఆసుపత్రిని నిర్వహించారు. కాలక్రమేణా సివిల్ ఆసుపత్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా మారడంతో నాటి నుంచి నేటి వరకు ఈ భవనం నిరుపయోగంగానే ఉంది. ప్రసుత్తం ఈ భవనం వెనుక రూ.కోటి యాభై ఆరు లక్షల వ్యయంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రభుత్వం నూతన భవనాన్ని నిర్మించింది. భవన నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఈ ప్రాంతం ఆవరణ చుట్టూ ప్రహరీ కూడా నిర్మించారు. కానీ పాత భవనం తొలగించకపోవడంతో నూతన భవనానికి ఇబ్బందికరంగా మారింది. ఈ భవనాన్ని తొలగించాలని స్థానిక వైద్యాధికారి జిల్లా వైద్యాధికారి ద్వారా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా కోరినప్పటికీ అధికార యంత్రాంగం తొలగించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం ప్రారంభించేలోపు పురాతన భవనాన్ని తొలగించాలని గ్రామప్రజలు కోరుతున్నారు.

బియ్యం అందజేత

హుజూర్‌నగర్ : తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మిగిలిన హుజూర్‌నగర్‌కు చెందిన చిన్నారి ఉదారి జోష్నకు స్థానిక కౌన్సిలర్ ఓరుగంటి నాగేశ్వరరావు శుక్రవారం 25 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో పుష్పావతి, అడ్వకేట్ ఉదారి యాదగిరి, పుల్లయ్య, సంధ్యారాణి, సోమయ్య, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

పౌర సేవలను అనుసంధానం చేయాలి

నడిగూడెం : సీఎస్‌సీ సర్వీసు సెంటర్లకు పౌర సేవలను అనుసంధానం చేసి ఉపాధి కల్పించాలని సీఎస్‌సీ సెంటర్ నిర్వాహకుల సంఘం జిల్లా నాయకుడు జలగం శివకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం నడిగూడెం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎస్‌సీ సెంటర్లకు పౌర సేవలు అనుసంధానం చేస్తే గ్రామ స్థాయిలో ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలు అందుతాయన్నారు.

సీపీఐకి రాజీనామా

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన సీపీఐ నాయకుడు చెనగాని చినసత్యనారాయణ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం విలేకరులకు తెలిపారు. తనతో పాటు మరి కొందరు కూడా పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు.

బూరుగడ్డ ఆలయంలో సహస్రనామ కుంకుమార్చన



గోమాత పూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం సహస్ర కుంకుమార్చనను అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, సహస్రనామ కుంకుమార్చన, స్వామివార్లకు పంచామృతాభిషేకం, శ్రీగోదాదేవికి ప్రత్యేక పూజలు, అష్టోత్తర శతనామావళి, అలంకరణ, గోపూజ, అనంతరం ఆరగింపు, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది యరగాని కిరణ్‌గౌడ్, గోవిందరెడ్డి, రమేష్, ఉపేందర్, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి వార్షికోత్సవం

మునగాల : మండల కేంద్రం శివారులోని చెరువు కట్టపై గల శ్రీపెద్దమ్మతల్లి ఆలయ మూడవ వార్షికోత్సవంలో ముదిరాజ్ కుటుంబసభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మునగాల పరగణా ముదిరాజ్ సంఘం సభ్యులు శుక్రవారం కోరారు. వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 7 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అమ్మవారికి అభిషేకాలు ఉంటాయని ఆయన తెలిపారు. సాయంత్రం 4 గంటలకు అమ్మవారికి బోనాల సమర్పణ, ఆలయం ఆవరణలో అమ్మవారి చరిత్ర ప్రదర్శింపబడుతుందని ఆయన పేర్కొన్నారు. ఆదివారం ఉదయం అమ్మవారికి, పోతరాజుకు నైవేద్యం సమర్పణ ఉంటుందని ఆయన తెలిపారు.



ముస్తాబైన పెద్దమ్మ ఆలయం

అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి



మోతె : రాఘవాపురంలో మొక్కలు పంపిణీ చేస్తున్న ఏపీఓ

మోతె : అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని మోతె మండల ప్రత్యేకాధికారి సీతారాంనాయక్ అన్నారు. శుక్రవారం మోతె మండల కేంద్రంలో పలు ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు, సిబ్బందికి నిర్వహించిన సమీక్ష సమావేంలో ఆయన మాట్లాడారు. వనమహోత్సవంలో భాగంగా ఇంటింటికీ ఆరు రకాల పండ్లు, పూల మొక్కలు పంపిణీ చేయాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరిసింగ్, తహసీల్దార్ సంఘమిత్ర, ఏపీఓ నగేష్, ఏపీఎం వెంకయ్య, అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

గ్రామాల్లో వన మహోత్సవం

మోతె : మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం ఆరు రకాల పూలు, పండ్ల మొక్కలను ఏపీఓ నగేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాల సీజన్ ప్రారంభమైనందున ప్రతి ఇంట్లో పండ్లు, పూల మొక్కలు నాటుకోవాలన్నారు. రోడ్ల వెంట, కాల్వల వెంట తీసిన గుంతల్లో మొక్కలు నాటాలన్నారు.

ఇంటింటికీ మొక్కలు పంపిణీ



మఠంపల్లి : మట్టపల్లిలో మొక్కలు పంపిణీ చేస్తున్న కార్యదర్శి, సిబ్బంది

మఠంపల్లి : వన మహోత్సవంలో భాగంగా మఠంపల్లి మండలంలోని మట్టపల్లి, గుండ్లపల్లి, పెదవీడు తదితర గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు దేవరకొండ చంద్రశేఖర్, లక్ష్మణ్‌నాయక్, ఉమాదేవి, సిబ్బంది ఉన్నారు.

అధ్వాన రోడ్డుపై రైతుల నిరసన



చిలుకూరు - దూదియాతండా రోడ్డులో గుంతల్లో నిలిచిన నీటి వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

చిలుకూరు : మండల కేంద్రం నుంచి దూదియాతండా వెళ్లే రోడ్డును డబుల్ లేన్ రోడ్డుగా మార్చాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం దూదియాతండా రోడ్డులో పడిన గుంతల్లో నిలిచిన నీటిలో నిల్చొని వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దూదియాంతండా నుంచి కోదాడ మండలంలోని పలు రోడ్లకు ఈ రోడ్డు లింకు రోడ్డు అని దీంతో ఎప్పుడూ రద్దీగా ఉంటుందని తెలిపారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మంత్రి, ఎమ్మెల్యేలు స్పందించి రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు కొల్లు నర్సయ్య, దొడ్డా గురవయ్య, అలసకాని జనార్దన్, కొల్లు సత్యనారాయణ, బూర లక్ష్మీనారాయణ, కొడారు లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

నడిగూడెం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు సామినేని శ్రీనివాసరావు, జి.సుబ్రహ్మణ్యం, గడ్డం వెంకటేశ్వర్లు, బత్తిని శ్రీనివాసరావులను శుక్రవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మస్రం శ్రీనివాస్, రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు ఖలీల్ అహ్మద్, ఉపాధ్యాయులు శోభన్‌బాబు, డాక్టర్.కత్తి వెంకటేశ్వర్లు, ఎండీ.మౌలానా, అహల్యాదేవి, పర్వతాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రజతోత్సవాలను విజయవంతం చేయాలి



కోదాడరూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న చింత బాబు

కోదాడరూరల్ : హైదరాబాద్‌లో ఈ నెల 7న నిర్వహించబోయే మాదిగ దండోర రజతోత్సవాలను విజయవంతం చేయాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతా బాబు మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగ దండోరా ఉద్యమం ఎమ్మార్పీఎస్‌గా ఏర్పడి ఏబీసీడీ వర్గీకరణే లక్ష్యంగా ముప్పై సంవత్సరాలుగా అనేక పోరాటాలు చేస్తుందని తెలిపారు. ఈ రజతోత్సవ ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాదిగ మేధావులు హాజరవుతున్నారని తెలిపారు. మాదిగ, మాదిగ ఉపకులాల కవులు, కళాకారులు, స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాణాల అబ్రహం, ఏర్పుల చిన్ని మాదిగ, బొల్లెపోగు స్వామి, కందుకూరి నాగేశ్వరరావు, కొత్తపల్లి శ్రీను, పిడమర్తి బాబురావు, నూకపాగు రాంబాబు, సోమ నరసయ్య, గుర్వయ్య తదితరులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించాలి

మునగాల : గ్రామగ్రామాన ఈనెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అంజయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గుడిపాటి కనకయ్య కోరారు. శుక్రవారం మునగాలలో వారు విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాతకొట్ల నాగరాజుమాదిగ, మహాజన సోషలిస్టు పార్టీ మండల అధ్యక్షుడు ఎల్.శ్రీనివాస్ మాదిగ, చిర్ర విక్రమ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

హుజూర్‌నగర్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన సంఘటన శుక్రవారం హుజూర్‌నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద కారు బైక్‌ను ఢీ కొనడంతో సలీం కాలుకు గాయాలయ్యాయి. అతడిని 108 వాహనంలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. మెరుగైన వైద్య కోసం సూర్యాపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అక్రమంగా పైపులైన్ వేసిన వ్యక్తిపై కేసు

నడిగూడెం: చిలుకూరు మండల కేంద్రానికి చెందిన పుట్టపాక అంజయ్యకు రత్నవరంలో మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. తన అనుమతి లేకుండా తన మామ అయిన రత్నవరానికి చెందిన కురాకుల శ్రీరాములు శుక్రవారం అక్రమంగా పైపులైన్ వేశాడు. దీంతో అంజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు ఎస్ఐ అజయ్ కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి



విద్యుదాఘాతంతో మృతి చెందిన గేదెలు

హుజూర్‌నగర్ రూరల్: మండలంలోని బూరుగడ్డ గ్రామ శివారులో శుక్రవారం విద్యుదాఘాతానికి గురై రెండు పాడి గేదెలు మృతి చెందాయి. గ్రామంలోని రాగం నాగయ్యకు చెందిన రెండు పాడి గేదెలు గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల్లోకి మేతకు వెళ్లాయి. సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ వలయం లేకపోవడంతో అటుగా వెళ్లిన గేదెలు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. ఒక్కో గేదె విలువ రూ.లక్ష ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. రాష్ట్ర ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని, వ్యవసాయ పొలాల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ శాఖ అధికారులు రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

తప్పులను, అవినీతిని తప్పకుండా ప్రశ్నిస్తా

సూర్యాపేట : ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు అప్పటి మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి డబుల్‌బెడ్ రూం ఇళ్ల డ్రా పేరుతో మోసానికి పాల్పడ్డారని, ఇందుకు జిల్లా కలెక్టర్‌గా ఎస్.వెంకటరావు సహకరించారని బీజేవైఎం రాష్ట్ర నాయకుడు సంకినేని వరుణ్‌రావు ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కుడకుడ శివారు సర్వే నంబర్ 126లో బీఆర్ఎస్ నాయకులు, మంత్రి అనుచరులు జీఓ 58, 59తో అక్రమంగా ప్రభుత్వ భూమి పొందారని ఆధారాలతో సహా నిరూపించానని తెలిపారు. దీన్ని జీర్ణించుకోని బీఆర్ఎస్ నాయకులు పట్టణంలో డబుల్‌బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులుగా ఎంపికైన కొందరితో ఇంటి ఎదుట ధర్నాలు చేయిస్తున్నారని విమర్శించారు. ఇళ్ల కోసం 16వేల మంది దరఖాస్తు చేసుకుంటే నిర్మాణం పూర్తయిన 385 ఇళ్లకు 804 మందిని డ్రాలో ఎలా ఎంపిక చేశారని ప్రశ్నించారు. 8నెలల గడుస్తున్నా ఎందుకు వారికి అలాట్‌మెంట్ చేయలేదని, ఈ విషయాన్ని లబ్ధిదారులు గమనించాలని తెలిపారు. కలెక్టర్ కాకుండా అర్ధరాత్రి సమయంలో మున్సిపల్ కమిషనర్, చైర్మన్ ఎలా డ్రాలు తీస్తారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు చెప్పిన వారికే ఈ ఇళ్లను కేటాయించారని ఆరోపించారు. జగదీష్‌రెడ్డి మంత్రిగా ఉన్నప్పుడే 15 కేసులు పెట్టినా భయపడలేదని, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి అవినీతి మొత్తం బయటపెడతానని తెలిపారు. క్యాంపు ఆఫీస్‌తోపాటు నాగారం, హైదరాబాద్‌లోని ఇళ్లను అవసరమైతే ముట్టడిస్తామని, అక్రమంగా సంపాదించిన ఆస్తులను 16వేల మంది పేదలకు పంచుతామన్నారు. మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎండీ.అబీద్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లమల్ల నరసింహ, పట్టణ ప్రధాన కార్యదర్శులు ఆరూరి శివ, తొనకునూరి సంతోష్‌కుమార్, నాయకులు శైలేందర్, మంగ్యానాయక్ పాల్గొన్నారు.